# ఇంటర్‌లో మసక.. మసకగా ప్రశ్న

- ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో 4, 5 పేజీల్లో ముద్రణా లోపం
- మార్కులు కేటాయిస్తామని ప్రకటించిన ఇంటర్ బోర్డు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో తప్పిదాలు వెలుగుచూస్తున్నాయి. సోమవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో ఓ ప్రశ్నను అస్పష్టంగా (మసక.. మసకగా) ఇచ్చారు. సెక్షన్-బీలో 7వ ప్రశ్నగా చార్ట్‌ను ఇచ్చారు. అయితే ముద్రణ లోపం కారణంగా ఈ చార్ట్‌లో ఇచ్చిన వివరాలు విద్యార్థులకు స్పష్టంగా కనిపించలేదు. దీంతోపాటు ప్రశ్నపత్రంలో 4, 5 పేజీలను సరిగ్గా ముద్రించలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. అస్పష్టంగా వచ్చిన ప్రశ్న నాలుగు మార్కుల ప్రశ్నకావడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నది. తప్పిదం ఇంటర్‌బోర్డుది కావడంతో నాలుగు మార్కులు కలపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. కొందరు విద్యార్థులు ఇదే విషయంపై లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటర్ బోర్డు స్పందించింది. ఏడో ప్రశ్నలో గీతలతో అస్పష్టత నెలకొనడంతో సబ్జెక్ట్ నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు. సమాధాన పత్రంలో జవాబు రాయడానికి ప్రయత్నించిన వారందరికీ కేటాయించిన మార్కులు ఇవ్వనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. సోమవారం నిర్వహించిన సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 13,029 మంది విద్యార్థులు (2.91శాతం) గైర్హాజరయ్యారు.

## ప్రయాణికుల భద్రత పేరుతోవాహనదారులపై భారం

- రవాణా వాహనాలకు వీఎల్‌టీ డివైజ్ తప్పసరి
- కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ప్రయాణికుల భద్రత పేరుతో వాహనదారులపై రూ.8 వేల నుంచి రూ.10 వేల భారం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రవాణా, గూడ్స్ వాహనాల్లో వెహికల్ లొకేషన్ ట్రేసింగ్ (వీఎల్‌టీ) డివైజ్‌ల ఏర్పాటును తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వనికి లేఖ రాసింది. ఇటీవల ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ బస్సుల్లో మహిళలపై అఘాయిత్యాలు జరగడంతో వాహనాలకు వీఎల్‌టీ డివైజ్‌ల ఏర్పాటును తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రవాణా వాహనాలు ఎక్కడున్నా వెంటనే గుర్తించవచ్చని, ఏ వాహనంలోనైనా అవాంఛనీయ ఘటన జరిగితే క్షణాల్లో అధికారులను, పోలీసులను అప్రమత్తం చేసి నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుందని రవాణా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రోడ్లపై తిరుగుతున్న పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, గూడ్స్ వాహనాలతోపాటు కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకునే అన్ని రవాణా వాహనాల్లో వీఎల్‌టీ డివైజ్‌లను అమర్చనున్నారు. ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, గూడ్స్ వాహనాలకు పకడ్బందీ రక్షణ వ్యవస్థ లేదని, ఒక్కో వీఎల్‌టీ డివైజ్ ఏర్పాటుకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని అధికారులు చెప్తున్నారు. డివైజ్‌ను అమర్చని కొత్త వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయరని, పాత రవాణా వాహనదారులు వీఎల్‌టీ డివైజ్‌ను అమర్చుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## కేంద్రంపై గెలిచిన రఘునందన్!

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): పాస్‌పోర్ట్ రెన్యువల్ విషయంలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర ప్రభుత్వంపై విజయం సాధించారు. విదేశాంగ శాఖపై గతంలో రఘునందన్‌రావు హైకోర్టులో కేసు వేయడంతో తాజాగా ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రఘునందన్‌రావు తన పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం నిరుడు మార్చి 13న హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీస్‌లో దరఖాస్తు చేశారు. కానీ, ఆయనపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండటంతో రెన్యువల్ చేయలేదు. దీనిపై ఆయన హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. రఘునందన్‌రావు దరఖాస్తును పరిశీలించాలని రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్‌ను ఆదేశించింది. ఇదే సమయంలో రఘునందన్ రావుకు కొన్ని షరతులు విధించింది.

## నిందితులకు శిక్షలుపడేలా కృషిచేయాలి

**ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): గంజాయి, డ్రగ్స్‌ను పట్టుకోవడమే కాకుండా.. నిందితులకు శిక్షలు పడేవిధంగా యంత్రాంగం కృషి చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆబ్కారీ భవన్‌లో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టిన ఐదుగురు ఎక్సైజ్ అధికారులను కమలాసన్‌రెడ్డి అభినందించి.. క్యాష్ రివార్డులు అందించారు. క్యాష్ అవార్డులు అందుకున్న వారిలో కొత్తగూడెం డీటీఎఫ్ సీఐ కరంచంద్, కరీంనగర్ సీఐ కే నాగేశ్వర్‌రావు, జగిత్యాల ఎస్‌హెచ్‌వో సర్వేశ్, ఆలేరు ఎస్‌హెచ్‌వో దీపిక, జూనియర్ అసిస్టెంట్ సృజన ఉన్నారు.



*మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన మ్యూజియంను సందర్శించిన విదేశీయులు*

## గిరిజన మ్యూజియంలో విదేశీయుల సందడి

హైదరాబాద్, మార్చి10 (నమస్తే తెలంగాణ): మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన మ్యూజియంలో విదేశీయులు సందడి చేశారు. గయానా, టాంజానియా, సురినామె, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన మీడియా అధికారులు, ప్రతినిధులకు ఎంసీహెచ్‌ఆర్డీలో శిక్షణ కొనసాగుతున్నది. దీనిలోభాగంగా తెలంగాణ గిరిజన సంస్కృతి, జీవన విధానాలను అవగాహన చేసుకోవడానికి ఆయా దేశాల ప్రతినిధులు మ్యూజియాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు తయారు చేసే పొట్లి అనే అరుదైన కానుకను అందించారు. కార్యక్రమంలో సంస్థ సంచాలకులు డాక్టర్ వీ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఈ-స్టూడియో అధికారులు పాల్గొన్నారు.

## కోర్టుల్లో వైద్యసౌకర్యాలపై వివరణ ఇవ్వండి

**రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): కోర్టు ప్రాంగణాల్లోని దవాఖానల్లో కల్పిస్తున్న వైద్య సౌకర్యాలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు హైకోర్టు పరిపాలన విభాగం రిజిస్ట్రార్ జనరల్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తోపాటు వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్లకు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుక ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

## మైనర్ మినరల్స్ వేలానికి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మైనర్ మినరల్ బ్లాకుల వేలానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రానైట్‌కు డెడ్ రెంట్ (లీజుదారు ఏటా రాయల్టీ రూపంలో చెల్లిస్తున్న కనీస మొత్తం)పై 5 రెట్లు, ఇతర ఖనిజాలకు డెడ్ రెంట్‌పై 10 రెట్లు రిజర్వు ధరగా, రిజర్వు ధరపై 2.5 శాతాన్ని ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ)గా, బిడ్డింగ్ ప్రక్రియలో కనీస పెంపును రూ.25 వేలుగా నిర్ణయించింది. వేలంలో ఎవరూ పాల్గొనకపోయినా, ఒక్కరే పాల్గొన్నా లేక టెక్నికల్ బిడ్స్‌లో ముగ్గురి కంటే తక్కువ మంది అర్హత సాధించినా వేలాన్ని రద్దుచేయాలని స్పష్టం చేసింది.




















